వంతెన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం

- తుమ్మలపాలెం- గూడూరు మధ్య నిలిచిన రాకపోకలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ మార్గంలో తూములు తొలగించడంతో కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు


తుమ్మలపాలెం- పర్ణశాల మధ్య బురదమయంగా మారిన రోడ్డు

గూడూరు: గూడూరు- తుమ్మలపాలెం గ్రామాల మధ్య లజ్జబండ మురుగుకాల్వపై చేపట్టిన వంతెన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. లజ్జబండ మురుగుకాల్వపై శిథిలావస్థకు చేరిన వంతెన పునఃనిర్మాణానికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. వేసవిలో వంతెన నిర్మాణ పనులను అట్టహాసంగా ప్రారంభించారు.

సమస్య ఇదీ..

అయితే భారీ వంతెన నిర్మించే సమయంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కేవలం రెండు వరుసలలో చిన్నపాటి తూములతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరదనీరు తూముల ద్వారా వెళ్లే పరిస్థితి లేక నీరు పొంగడంతో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. తాత్కాలికంగా వేసిన తూములు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేయడంతో పంట పొలాలు ముంపు బారినుంచి బయట పడ్డాయి.

రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

తుమ్మలపాలెం ప్రజలు ఏ పనికావాలన్నా గూడూరు- 2 సచివాలయానికి రావాల్సిందే. రైతు సేవా కేంద్రం ద్వారా ఎలాంటి సేవలు పొందాలన్నా గూడూరుకు రావాల్సిన పరిస్థితి. తుమ్మలపాలెం విద్యార్థులు ఉన్నత విద్యకు గూడూరు రావాల్సిందే. నిత్యావసర వస్తువులు, కూరగాయాలు తదితర సామగ్రి కొనటానికి గ్రామస్తులు నిత్యం గూడూరుకు రాకపోకలు సాగిస్తారు. అలాంటి పరిస్థితిలో తాత్కాలిక రోడ్డులో తూములు తొలగించడంతో తుమ్మలపాలెం గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. గూడూరు గ్రామానికి చెందిన రైతులకు తుమ్మలపాలెం వైపు పెద్ద ఎత్తున పంట పొలాలు ఉన్నాయి. ప్రస్తుతం పొలాలకు వెళ్లే రైతులు కూడా ఇబ్బందులు తప్పటం లేదు.

చుట్టూ తిరిగిరావాల్సిందే..

తుమ్మలపాలెం నుంచి గూడూరుకు 3 కిలోమీటర్లు కాగా.. వంతెన నిర్మాణం కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో కొత్తతుమ్మలపాలెం మీదుగా పర్ణశాల వరకు 8 కిలోమీటర్లు ప్రయాణం చేసి గూడూరు రావాల్సి వస్తోంది. వంతెన నిర్మాణం అయ్యే వరకు ఇబ్బందులు తప్పవనుకుంటే కొత్తతుమ్మలపాలెం- పర్ణశాల మధ్య ఒక కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాడైన కిలోమీటరు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపడితే తమ రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయంటున్నారు.

డైవర్షన్ రోడ్డు సక్రమంగా వేయాలి



తుమ్మలపాలెం నుంచి రోజూ గూడూరు వెళ్లందే మా ఊరి ప్రజలకు ఏ పనీ జరగదు. డైవర్షన్ మార్గం ప్రజలకు ఉపయోగపడేలా వేయాలి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. మూడు కిలోమీటర్లతో గూడూరు చేరుకునే మేము, ఇప్పుడు చుట్టూ తిరిగి 8 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. గూడూరు హైస్కూలుకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి వర్ణనాతీతం

– తోట భాస్కరరావు, తుమ్మలపాలెం

మరమ్మతు పనులు చేపట్టాలి



వంతెన నిర్మాణ సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకకుండా కాంట్రాక్టరు పనులు చేపట్టడం తుమ్మలపాలెం వాసులపాలిట శాపంగా మారింది. పర్ణశాల సమీపంలో కిలోమీటరు మేర పూర్తిగా పాడైన రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడితే కొంత ఉపశమనం కలుగుతుంది. రైతులు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.

– వేముల సురేష్ రంగబాబు, జెడ్పీటీసీ సభ్యుడు

బాధితుడికి పేర్ని కిట్టు పరామర్శ



మచిలీపట్నంటౌన్: మండల పరిధిలోని పెదపట్నం గ్రామానికి చెందిన గొరిపర్తి ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడి కాలు విరగడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆంజనేయులను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం పరామర్శించారు. ఆంజనేయులును పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుడు గడిదేసి డేవిడ్‌రాజు తదితరులు ఉన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం

పట్టించుకోని అధికారులు



చల్లపల్లి: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతుండటంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. దమ్ము చక్రాలు తగిలించుకున్న ట్రాక్టర్లు ప్రధాన రహదారులపై తిరగరాదని ఎన్ని నిబంధనలు విధించినా పలువురు వాటిని పెడచెవిన పెడుతున్నారు. నిబంధనలకు తిలోదకాలిస్తూ అడ్డగోలుగా హైవేల పైన, ప్రధాన రహదారులపైన తిరుగుతూ రోడ్లను నాశనం చేస్తున్నారు. పోలీసులు గానీ, వీఆర్‌వోలు, ఆర్ అండ్‌బీ అధికారులు, ఆయా రోడ్ల పర్యవేక్షకులు ఎవరూ పట్టించుకున్న దాఖలులు లేవు. దీంతో అడ్డూ అదుపూ లేకుండా రోడ్లపై తిరుగుతున్నారు. దమ్ము చక్రాలకు ఇనుప బెల్టు తగిలించుకుని రోడ్లపై తిరగాలని గతంలోనే కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో అలా ఎవరూ తిరగటంలేదు. ఇలా తిరిగేవారిపై కఠిన చర్యలు తీసుకుని రోడ్లకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పుష్కర ఘాట్ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



నాగాయలంక: స్థానిక శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానది ఒడ్డున నాగాయలంక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అవనిగడ్డ సీఐ పి.యువకుమార్, ఎస్ఐ కలిదిండి రాజేష్ ఈబోర్డులను ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ ఘాట్ వద్ద నదిలో అధికంగా లోతు ఉందని, కృష్ణానదికి వరదలు పెరిగే అవకాశం ఉన్నందున సందర్శకులు, స్విమ్మర్స్ అప్రమత్తంగా ఉండాలని కోరారు. పోలీసుల హెచ్చరికలు, నిబంధనలు ఉల్లంఘించి నదిలో లోతుకు వెళ్తే చర్యలు తీసుంటామన్నారు. నది ఒడ్డున శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో తరచూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నందున భక్తులు సైతం అప్రమత్తంగా వ్యవహరించి జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు. వరదల సీజన్ కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఇక్కడ ఘాట్‌కు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై చైతన్యం అవసరం



పెడన: వరిసాగులో యాజమాన్య పద్ధతులను అవలంబించేలా రైతులను చైతన్య పరచాల్సిన బాధ్యత ఉందని ఫార్మర్స్ ట్రెనింగ్ సెంటరు డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి అన్నారు. సోమవారం పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ హాలులో పెడన, మచిలీపట్నం, గూడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకు(వీఏఏ)లకు వరి పంట సాగు యాజమాన్య పద్ధతులపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. జ్యోతిరమణి మాట్లాడుతూ నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యాలతో పాటు చీడపురుగుల నివారణ, సేంద్రియ ఎరువుల వాడకం తదితర వాటిపై పలువురు సైంటిస్టులు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రెనింగ్ సెంటరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, మచిలీపట్నం ఏడీఏ ఎన్.రమాదేవి, సైంటిస్టు రేవతి, ఏవోలు జెన్నీ, శివరామకృష్ణ, మధుకిరణ్, వీఏఏలు పాల్గొన్నారు.

నాగమ్మ తల్లికి పూజలు




కృత్తివెన్ను: మండల పరిధిలోని యండపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ నాగమ్మతల్లికి భక్తులు సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ప్రారంభంలో నాగదేవతకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలతో పాటు స్వీట్లు, పండ్లను సారెగా సమర్పించారు. మహిళలంతా కలసి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సారెను అందించారు. మహిళలు తాము తీసుకువచ్చిన సారెను తలపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

యువ రైతులకు శిక్షణ తరగతులు ప్రారంభం



ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో వరిలో నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై యువరైతులకు ఆరు రోజుల నైపుణ్యత శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ నాణ్యమైన విత్తన ఉత్పత్తి చేయాలంటే మంచి విత్తనాలకు కొన్ని ప్రమాణాలు ఉండాలన్నారు. జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, తేమ శాతం, మొలక శాతం ఆవశ్యకతను వివరించారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట లక్ష్మి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాలలో గ్రామీణ యువతకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా వనజ



అవనిగడ్డ: అవనిగడ్డ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎం.వనజను నియమించారు. ఎంపీడీవోగా పనిచేస్తున్న మరియాదేవి బాపట్లలో మూడు నెలలు శిక్షణ కోసం వెళ్లారు. ఆమె స్థానంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న వనజను అడిషనల్ ఫుల్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందజేయండి

వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు


ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మకు వినతిపత్రం ఇస్తున్న పేర్ని కిట్టు, పార్టీ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు సరఫరా చేసి సహకరించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కోరారు. ఈ మేరకు మీకోసం కార్యక్రమంలో సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. కిట్టు మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో సుమారు 19 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్న రైతులకు సకాలంలో ప్రభుత్వం ద్వారా ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా 400 మెట్రిక్ టన్నుల ఎరువులు సబ్సిడీ ద్వారా రైతులకు అందజేయటం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరాను నిలుపుదల చేశారన్నారు. నియోజకవర్గంలో 14 సహకార సంఘాలు ఉండగా మూడు సంఘాలు మాత్రమే ఎరువులు పంపిణీ చేయటం వల్ల సన్న, చిన్నకారు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువుల కోసం వెళితే పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకురమ్మని చెబుతున్నారే తప్ప తీసుకువెళ్లిన వారికి రెండు కట్టలు మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతులు ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు కొనాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సకాలంలో రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా సరఫరా చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తిరుమాని శ్రీనివాసరావు, మచిలీపట్నం నార్త్ మండల రైతు సంఘం అధ్యక్షుడు గడిదేశి రాజు, సౌత్ మండల అధ్యక్షులు కంచర్లపల్లి విజయసారధి, వైఎస్సార్ సీపీ సౌత్ మండల పార్టీ అధ్యక్షులు జన్ను రాఘవరావు, కార్యదర్శి గణేశన రమేష్, పీఏసీఎస్‌అధ్యక్షులు గడిదేశి పెదవెంకయ్య, పిప్పళ్ల నాగబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

49 మద్యం సీసాలు స్వాధీనం

నలుగురిపై బైండోవర్ కేసులు

చల్లపల్లి: మండల కేంద్రమైన చల్లపల్లి, నడకుదురు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.భానూ సత్యనారాయణ ఆధ్వర్యంలో బృందం బందరు రోడ్డులో వీరబాబు వద్ద నుంచి 19 బాటిల్స్, నడకుదురులో కోటేశ్వరరావు వద్ద నుంచి 30 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు కొత్తమాజేరులో గోపి, పాతమాజేరులో శివప్రసాద్‌లను మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకుని చల్లపల్లి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం అమ్మకాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మొవ్వ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వరాలరాజు హెచ్చరించారు.

ఆధార్ నమోదుకు అవసరమైన పత్రాల పంపిణీ


ధ్రువీకరణ పత్రాలు పొందిన ఎస్టీలతో తహసీల్దార్, సర్పంచి

కోడూరు: ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉంటున్న ఎస్టీ కుటుంబాలకు రెవెన్యూ అధికారులు సోమవారం ఆధార్ కార్డులు పొందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందించారు. మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు పెదగుడుమోటు సమీపంలో ఏడు ఎస్టీ కుటుంబాలకు చెందిన 21 మంది నివాస ముంటున్నారు. అయితే వీరికి ఆధార్ కార్డులు లేకపోవడంతో పథకాలకు అర్హత పొందలేక పోతున్నారు. వీరు ఆధార్ కార్డులు నమోదు చేసేందుకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేవు. దీంతో గ్రామ సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గ విషయాన్ని తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే ఎస్టీ కుటుంబాలకు ఆధార్ కార్డులు పొందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో అందించారు. వీఆర్వో పెనుమూడి వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈగా గణపతి



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ ఇరిగేషన్ డీఈగా బీబీఎస్ గణపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు డివిజన్‌లో ఏఈగా పని చేసిన గణపతి ఉద్యోగోన్నతిపై డీఈగా వచ్చారు. గతంలో డీఈగా పని చేసిన రవికిరణ్ ఈఈగా పదోన్నతిపై వెళ్లిన తరువాత ఇద్దరు ఇన్‌చార్జి డీఈలు వచ్చారు. డీఈగా వచ్చిన గణపతిని పలువురు ఏఈలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకుందాం


స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తున్న వామపక్ష నేతలు


మోపిదేవిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చల్లపల్లి: స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకుని విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు ఆగస్టు 5వ తేదీన జరిగే ఆందోళనకు మద్దతుగా వామపక్ష నేతలు సోమవారం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు మీర్ రిజ్వాన్, సీపీఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బళ్ల వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, గోళ్ల సాంబశివరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు పరుచూరి జనార్ధనరావు, ఎస్.బాలయ్య, కొండేటి భాస్కరరావు తదితరులు సంతకాలు సేకరించినవారిలో ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

మోపిదేవి: స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని, బిగించిన మీటర్లను తొలగించాలని ఆగస్టు 5వ తేదీ చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండలశాఖ పిలుపు నిచ్చింది. మండలంలోని మోపిదేవిలో సోమవారం సీఐటీయూ, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రజలకు ఛార్జీలు భారం పెట్టింపు అవుతుందని తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తూ వచ్చేనెల 5న విద్యుత్ కార్యాలయం వద్ద చేపట్టే ఆందోళనలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నాలని కోరారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, జిల్లా ఎంపీఈఎల్‌డీ దానే సహదేవుడు, ఆటో పంచాయతీ కార్మికుల ప్రజా సంఘం నాయకులు రావి బుట్టో, రావి ప్రసాదరావు, కొలుసు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు, తీగలపై మొక్కల తొలగింపు


కోడూరు తూర్పువైపున ఉన్న విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు తొలగించిన అనంతరం


ఉల్లిపాలెం నాగపుట్ట సమీపంలో విద్యుత్ స్తంభంపై పిచ్చి మొక్కల తీగలు తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

కోడూరు: విద్యుత్ స్తంభాలు, తీగలపై అల్లుకొని ప్రమాదకరంగా మారిన పిచ్చితీగలు, మొక్కలను విద్యుత్ శాఖాధికారులు ఎట్టకేలకు తొలగించారు.కోడూరు, ఉల్లిపాలెం గ్రామాల్లోని పలు స్తంభాలు, తీగలపై పిచ్చిమొక్కలు అల్లుకోవడం, విద్యుత్ స్తంభాల వద్ద జంగిల్ క్లియరెన్స్ లేదంటూ 'అల్లుకున్న నిర్లక్ష్యం..!!' పేరుతో 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించి విద్యుత్ శాఖ ఏఈ గోపీచంద్ వెంటనే సిబ్బందితోకలిసి జంగిల్ క్లియరెన్స్‌పై దృష్టి పెట్టారు. ఉల్లిపాలెం జెడ్పీ పాఠశాల వెనుక స్తంభం, తీగలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌పై అల్లుకున్న పిచ్చితీగలను తొలగించారు. కోడూరు తూర్పు, ఉల్లిపాలెం నాగపుట్ట, మధ్యవాడకట్ట సమీపాల్లోని స్తంభాలపై పెరిగిన తీగలు, చుట్టూ ఉన్న ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. సిబ్బంది స్తంభాలపై పర్యవేక్షణ చేయాలని, ఇలా పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



'సాక్షి'లో ప్రచురించిన కథనం

ఉద్యోగుల సేవలు మరువరానివి


మాదిగ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

మచిలీపట్నంటౌన్: సమాజ సేవే పరమావధిగా పని చేస్తున్న మాదిగ ప్రభుత్వ ఉద్యోగుల సేవలు మరువరానివని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు అన్నారు. ఎంఈఎఫ్ కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పెనుముత్స మధుసూదనరావు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ జీ భానుమూర్తి, ఎంఈఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రావెళ్ల వరుణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొడమంచిలి చెంద్రశేఖర్, కొక్కిలిగడ్డ శ్రీను, చక్రవర్తిలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడెల్లి మరియకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కారుమూడి వెంకయ్య, ఎంఈఎఫ్ లీగల్ అడ్వైజర్ అద్దేపల్లి నిరంజనరావు, ఎంఈఎఫ్ జిల్లా అదనపు జనరల్ సెక్రటరీ దర్గారావు, నాయకులు కొడాలి అజయ్‌కుమార్, బండారు వెంకటేశ్వరరావు, గురివిందపల్లి విజయ్‌బాబు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవలు


గుడికి వాటర్ ట్యాంక్ అందజేస్తున్న ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: వాసవి క్లబ్, వనితా క్లబ్, కపుల్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ గవర్నర్ అన్నం సాయి సునీత, వైస్ గవర్నర్ మాజేటి హరిప్రసాద్, క్యాబినెట్ ట్రెజరర్ సముద్రాల సూర్యప్రకాష్‌రావు మచిలీపట్నం క్లబ్బుల విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమంలో పేదలకు గొడుగులు, చీరలు, దుప్పట్లు, ఆర్యవైశ్య పేద విద్యార్థినికి రూ.7,058 ఆర్థిక సాయం, ముత్యం గుడికి వర్రెగూడెం రామాలయానికి వెయ్యి లీటర్ల రెండు వాటర్ ట్యాంకులు, లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థినులకు యూనిఫామ్ లు అందజేశారు. క్లబ్బు ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, అన్నం అశోక్, దివ్య, అనురాధ, ఉదయగిరి సతీష్, వాసవి క్లబ్ నగర ప్రెసిడెంట్ రాంబాబు, సెక్రటరీ ప్రసాద్, ట్రెజరర్ గణేష్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ శ్రీదేవి, సెక్రటరీశామిలి, ట్రెజరర్ సంగీత, వాసవి క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు టీ మధు, సెక్రటరీ తమ్మన ప్రసాద్, ట్రెజరర్ మామిడి భాస్కర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

● ముస్తాబైన ఓపెన్ జిమ్


ఓపెన్ జిమ్


చిల్డ్రన్స్ పార్కు

వాకర్స్ అసోసియేషన్, దాతలు, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల సహాయ సహకారాలతో పార్కులో ఓపెన్ జిమ్ ముస్తాబైంది. కొత్త ట్రాక్, పాత షటిల్ కోర్టును ఆధునికీకరించారు. పార్కులో 21 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించేందుకు అనువుగా సిద్ధం చేశారు. సుందరంగా తయారైన పార్కు ప్రకృతి ప్రేమికులకు పార్కు ఆహ్వానం పలుకుతోంది.

– చల్లపల్లి